క్లుప్తంగా

పులిచింతల నుంచి 5 గేట్ల ద్వారా నీటి విడుదల

మేళ్లచెరువు: చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం రాత్రి వరకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 2,73,900 క్యూసెక్కుల వరద వస్తుండగా.. ఐదు గేట్లను నాలుగు మీటర్ల మేరకు పైకెత్తి 1,84,692 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపారు.

హుజూర్‌నగర్ ఎస్‌ఐగా బండి మోహన్‌బాబు


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్‌ఐ

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ ఎస్‌ఐగా బండి మోహన్‌బాబు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన ముత్తయ్య సాగర్‌కు బదిలీ అయ్యారు. దీంతో నల్లగొండ వీఆర్‌లో ఉన్న ఈయనను ఉన్నతాధికారులు హుజూర్‌నగర్‌కు బదిలీ చేశారు.

నేడు మాంసం విక్రయాలు నిషేధం

హుజూర్‌నగర్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం మాంసం విక్రయాలపై నిషేధం విధిస్తూ నోటీస్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చికెన్, మటన్, చేపలు, ఇతర మాంసం విక్రయదారులు తమ దుకాణాలను మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘించి మాంసం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మృతి

మునగాల : మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు వెంపటి గురవమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. గురవమ్మ భౌతికకాయాన్ని పలువురు సీపీఎం నాయకులు సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు షేక్ సైదా, వీరబోయిన వెంకన్న, వెంపటి వీరబ్రహ్మ, దైద సైదులు, బూతం వెంకన్న, పరుశరాములు, వీరబాబు, వెంకన్న, సూరి, పరుశరాముడు ఉన్నారు.

గ్రంథాలయ భవనం నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న నాయకులు

నేరేడుచర్ల : మండలంలోని సోమారం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ భవనం నిర్మాణానికి గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకట్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో పాఠశాలలో గ్రంథాలయ భవన నిర్మాణానికి, అందులో కంప్యూటర్ల ఏర్పాటుకు రూ.34 లక్షలు, అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రహిముద్దీన్, అజయ్, బుజ్జి, రవి, గోపి, కృష్ణారావు, అచ్చయ్య, అజిత్, నాగు, కరుణాకర్, వెంకన్న తదితరులు ఉన్నారు.

తాడువాయి పీఏసీఎస్ పాలకవర్గం రద్దు

మునగాల : మండలంలోని తాడువాయి పీఏసీఎస్ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ జిల్లా కోఆపరేటివ్ అధికారి ఎస్.పద్మ ఈనెల 12న ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో స్థానిక పీఏసీఎస్ కార్యదర్శి.. చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 11 మంది డైరెక్టర్లకు నోటీసులు అందించారు. సదరు నోటీసులను వారు తీసుకోకపోవడంతో తిరిగి జిల్లా కార్యాలయానికి పంపారు. అనంతరం రాష్ట్ర కోఆపరేటివ్ అధికారుల ఆదేశాల మేరకు తుంగతుర్తి సొసైటీ సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఇందిరను తాడువాయి పీఏసీఎస్ ఇన్‌చార్జిగా నియమించడంతో గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు. తాడువాయి పీఏసీఎస్‌లో లక్షల రూపాయలు అవినీతి జరిగినట్లు నిర్ధారణ కావడంతో పాలకవర్గం అసమర్థతగా భావించి పాలవర్గాన్ని రద్దు చేసినట్లు తెలిసింది. అవినీతికి పాల్పడిన పీఏసీఎస్ కార్యదర్శి నాగేందర్, స్టాఫ్ అసిస్టెంట్ కోటయ్య, కంప్యూటర్ ఆపరేటర్ ఫర్వీనా విచారణ పూర్తి కావడం, సొసైటీకి చెందిన లక్షలు దుర్వినియోగం కావడం నిర్ధారణ కావడంతో త్వరలో వారి నుంచి రికవరీ చేయనున్నట్లు తెలిసింది.

పీఏసీఎస్ పాలకవర్గం గడువు పొడిగింపుపై హర్షం

కోదాడరూరల్ : వ్యవసాయ పరపతి సంఘాల పాలకవర్గాల గడువు మరో ఆరు నెలల పొడిగించడం పట్ల కోదాడ సంఘం చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఆయన కోదాడలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తమ పాలకవర్గ గడువును పెంచిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

వాగులు ఉప్పొంగి నీటమునిగిన పొలాలు

వరదలకు కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలు అతలాకుతలం

- నీటిలోనే వేల ఎకరాల పంట పొలాలు
- పలు కాలనీల్లో నీరు చేరి ఇబ్బందులు
- రోడ్లపై రాకపోకలకు అంతరాయం


మునగాల : ముకుందాపురంలో నీటమునిగిన వరిపైరు


కోదాడరూరల్ : చిమిర్యాల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఉలకవాగు


నడిగూడెం : రత్నవరం వద్ద రహదారిపై పొంగిపొర్లుతున్న వాగు


కోదాడ : షిర్డీ సాయినగర్‌లోకి చేరిన వరదనీరు

కోదాడ : పట్టణంలో బుధవారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నడిగూడెం మండలంలో కురిసిన భారీ వర్షానికి వరద కోదాడ పెద్దచెరువుకు చేరడంతో అలుగు మూడు నుంచి నాలుగు అడుగుల ఎత్తులో పారింది. ఈ వరద తమ్మర వాగు నుంచి షిర్డీసాయినగర్ కాలనీలోకి చేరడంతో పలు ఇళ్లు ముంపునకు గురయ్యాయి.

పరిశీలించిన ఎమ్మెల్యే పద్మావతి..

కోదాడ పెద్దచెరువు అలుగుపారడంతో ముంపునకు గురైన షిర్డీసాయినగర్ కాలనీని గురువారం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి పరిశీలించారు. కాలనీ ముంపునకు గురికాకుండా రిటైనింగ్‌వాల్ నిర్మించేందుకు ప్రయత్నిస్తామని ఆమె కాలనీవాసులకు హామీ ఇచ్చారు. వాగులో ఆక్రమణలు తొలగించే విధంగా చూడాలని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు.

ఎస్సీ, బీసీ కాలనీలు జలమయం..

నడిగూడెం : గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నడిగూడెం చౌదరి చెరువు అలుగు పోస్తుండడంతో నడిగూడెంలోని ఎస్సీ, బీసీ కాలనీలు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి నీరు చేరింది. నీట మునకకు గురైన పలువురు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. బస్టాంట్ నుంచి బరాఖత్‌గూడెం వెళ్లే రోడ్డుపై వరద నీరు భారీగా ప్రవహిస్తుండడంతో అధికారులు రోడ్డును బ్లాక్ చేశారు. రత్నవరం రహదారిపై రెండు గండ్లు పెట్టడంతో మునక ప్రాంతాలు తేలాయి. కోదాడ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఏపూరి తిరుపతమ్మ, తహసీల్దార్ వి.సరిత, ఎస్‌ఐ గందమళ్ల అజయ్‌కుమార్, ఎంపీడీఓ విజయకుమారి, స్థానిక పంచాయతీ కార్యదర్శి ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టారు. నడిగూడెం, చాకిరాల, రత్నవరం, గ్రామాల మీదుగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వందల ఎకరాల పొలాలు నీట మునిగాయి. చాకిరాల, రత్నవరం కల్వర్టుల వద్ద ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా అధికారులు రహదారులను మూసివేశారు.

700 ఎకరాల్లో నష్టం

నడిగూడెం మండల వ్యాప్తంగా వర్షాలకు 700 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో నీట మునిగిన పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంట నష్టంపై మొత్తం 16 గ్రామాల్లో ప్రాథమిక అంచనా వేసినట్లు ఆయన తెలిపారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

మేళ్లచెరువు : వర్షాలకు మండల కేంద్రంలోని నాగులచెరువు అలుగు పోస్తుండడంతో సమీపంలోని పంట పొలాలు నీటమునిగాయి. మేళ్లచెరువు -కోదాడ ప్రధాన రహదారిపై కందిబండ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి కోసం వేసిన తాత్కాలిక రోడ్డు దెబ్బతినడంతో భారీ వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. మండల కేంద్రంలోని రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జిలోకి భారీగా వరద నీరు చేరడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. అధికారులు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని లోతట్టు ప్రాంతాలను, దొండపాడు గ్రామ పరిధిలోని ఎర్ర వాగు ఉధృతిని తహసీల్దార్ సురేందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కేజీబీవీలో కూలిన చెట్టు

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మేళ్లచెరువు మండల కేంద్రంలోని చింతలపాలెం కేజీబీవీ పాఠశాలలో గురువారం చెట్టు విరిగి పడ్డాయి. తరగతి గదులు ఇరుకుగా ఉండడంతో వర్షం వచ్చిన సమయంలో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండడంతో తల్లిదండ్రులు పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లారు.

మఠంపల్లి : మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గురువారం ఊర చెరువులు అలుగు పోయగా వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. యాతవాకిళ్ల వద్ద వేములూరు రిజర్వాయర్ పూర్తిగా నిండి అలుగు పోయడంతో వాగు ఉప్పొంగి ప్రవహించింది. దీంతో యతవాకిళ్ల- హనుమంతులగూడెం మధ్య గల వంతెనపై వరదనీరు పారి రెండు గ్రామాలతో పాటు మఠంపల్లి- గరిడేపల్లి మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మఠంపల్లి, చౌటపల్లి గ్రామాల ఊరచెరువుల అలుగు నుంచి వరద నీరు మఠంపల్లి వద్ద కప్పల వాగులో కలిసి మఠంపల్లి -రఘునాథపాలెం ప్రధాన రహదారిపై భారీ వరదతో రాకపోకలు నిలిచాయి. వేములూరు వాగు వరదనీటిలో చెన్నాయిపాలెం, మంచ్యాతండా, వరదాపురం గ్రామాల పరిధిలో పంటపొలాలు నీటమునిగాయి.

నీటమునిగిన పొలాలు

చిలుకూరు : మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి కురిసిన వర్షానికి చెరువులు నిండి అలుగుపోస్తున్నాయి. చిలుకూరు, నారాయణపురం, సీత్లాతండా, బేతవోలు తదితర గ్రామాల్లో వరి పొలాలు నీట మునిగాయి. నారాయణపురం చెరువు అలుగు పోస్తుండడంతో నారాయణపురం నుంచి సీత్లాతండా రోడ్డుపై వరదనీరు ప్రవహించి రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే బేతవోలు చెరువు నీళ్లు రోడ్డుపైకి వస్తుండడంతో బేతవోలు గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎస్‌ఐ సురేష్‌రెడ్డి, తహసీల్దార్, గ్రామ పంచాయతీ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు చెరువులను పరిశీలిస్తున్నారు.

రాకపోకలు పునరుద్ధరణ

హుజూర్‌నగర్ : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం గురువారం కొంత తెరిపినిచ్చింది. దీంతో మండలంలో నిలిచిపోయిన పలు గ్రామాల మధ్య రాకపోకలను పునరుద్ధరించారు. వేపలసింగారం, మిట్టగూడెం, శ్రీనివాసపురం, అమరవరం, లక్కవరం, హుజూర్‌నగర్ గ్రామాల మధ్య రాకపోకలు సాయంత్రానికి యథావిధిగా కొనసాగాయి. గోపాలపురం వద్ద వేములూరు వాగు ప్రవాహం తగ్గకపోవడంతో సమీపంలోని వరి పొలాలు నీట మునిగే ఉన్నాయి. పట్టణంలో లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు. మండలంలోని వరద ముంపునకు గురైన ప్రాంతాలను, వరి పొలాలను, శ్రీనివాసపురం వద్ద వరద ఉధృతిని తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఆర్‌ఐ గాలి శ్రీనివాస్ పరిశీలించారు.

వరదనీటిలో వంద ఎకరాలు

మునగాల : వర్షాలకు మునగాల ఊరచెరువు గురువారం అలుగుపోయడంతో చెరువు కింద 50 ఎకరాల వరిపైరు నీటమునిగింది. ముకుందాపురంలో ముక్త్యాల బ్రాంచి కాలువ కింద గల యూటీ పూడిపోవడంతో ఎగువ నుంచి వచ్చిన వరదనీటితో సుమారు 100 ఎకరాలు వరి మునిగింది. మండల వ్యాప్తంగా ఉన్న చెరువుల్లో 80శాతం అలుగుపోస్తున్నాయని ఇరిగేషన్ ఏఈలు శ్రీనివాసరావు, వినయ్ తెలిపారు. కలకోవ ఊరచెరువుకు వరదనీటి ఉధృతి ఎక్కువై అలుగుపై మూడు అడుగుల ఎత్తున నీరు బయటకు రావడంతో అలుగు కింద ఉన్న కంప, పిచ్చిచెట్లను గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకుడు బుర్రి శ్రీరాములు జేసీబీ సాయంతో తొలగించి కాలువ పూడికతీత పనులు చేయించారు.

వరదలో కొట్టుకుపోయిన బైక్

గరిడేపల్లి : మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లాయి. వరి పొలాలు నీటి మునిగాయి. పొనుగోడులోని జెడ్పీహెచ్ఎస్ వద్ద ఉన్న చెరువు వంతెనపై, అప్పిరెడ్డిగూడెం నుంచి సుభాష్‌నగర్ వెళ్లే దారిలో ఉన్న వంతెనపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాళ్లమల్కాపురం నుంచి వెలిదండ వెళ్లే రోడ్డుపై తాళ్లమల్కాపురం వద్ద ఉన్న వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొక్కిరేణి గ్రామానికి చెందిన వ్యక్తి స్థానిక అధికారులు వారిస్తున్న వినకుండా వరద నీటిలో బైక్‌పై వెళ్లడంతో బైక్ వరదలో కొట్టుకుపోయింది. అతను మాత్రం క్షేమంగా బయటపడ్డాడు. పొనుగోడు రిజర్వాయర్ ఎస్కేప్ ఛానల్ గేట్లు ఎత్తడంతో తాళ్లవాగు కింద ఉన్న పొలాలన్నీ నీట మునిగాయి. మండల ప్రత్యేక అధికారి శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీఓ సరోజ, తహసీల్దార్ బండ కవిత, ఎస్‌ఐ చలికంటి నరేష్, మండల వ్యాప్తంగా తిరిగి అధికారులను అప్రమత్తం చేశారు. వరద నష్టాన్ని అంచనా వేశారు.

ఉధృతంగా ప్రవహిస్తోన్న పాలేరు వాగు

కోదాడరూరల్ : భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి నీరు దిగువకు ప్రవహిస్తుండటంతో సమీపంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోదాడ మండలంలోని గ్రామాల్లో గురువారం రాత్రి వర్షం కురవలేదు. వర్షం రానప్పటికి బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఉలకవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నల్ల బండగూడెం- మంగలితండా మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చిమిర్యాల వద్ద కూడా వాగు పొంగడంతో సమీపంలోని పొలాలు నీట మునిగాయి. ఎగువ నుంచి వస్తున్న వరదతో రాష్ట్ర సరిహద్దులోని పాలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.

ఇళ్లలోకి వరదనీరు..

మోతె : మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో వీధులన్నీ జలమయమై ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. కొత్తగూడెం, బుర్కచర్ల గ్రామాల్లో పూరిళ్లు పాక్షికంగా కూలాయి. సిరికొండ- కాచిగూడెం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మోతె తహసీల్దార్ వెంకన్న జేసీబీతో రోడ్డు మధ్యలో గుంత తీయించడంతో ఆగిన వర్షపు నీరు వాగు ద్వారా దిగువకు వెళ్లడంతో రెండు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కూడలి ఏరు నుంచి వచ్చే వరద నీటితో నర్సింహాపురం, ఉర్లుగొండ, నేరడవాయి, తుమ్మగూడెం, అన్నారిగూడెం గ్రామాల్లో పొలాలు, విద్యుత్ మోటార్లు నీట మునిగాయి. మండల వ్యాప్తంగా 250 ఎకరాలకు పైగా పంటలు నీట మునిగాయి. రావిపహాడ్ పెద్ద చెరువు నిండి దిగువకు వాగులు, కాల్వల ద్వారా వరద నీరు వెళ్లడంతో వరి పంటలు నీట మునిగి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.


మోతె : రావిపహాడ్‌లో పాడపంగి వెంకన్న ఇంట్లోకి చేరిన వర్షపు నీరు


చిలుకూరు : అంతర్గంగ వంతెన వద్ద నీటమునిగిన వరి పొలాలు


నడిగూడెంలో రత్నవరం రోడ్డుకు గండి పెట్టిస్తున్న తహసీల్దార్ సరిత


గరిడేపల్లి : తాళ్లమల్కాపురం- వెలిదండ మధ్య వంతెనపై వరద ఉధృతి


మేళ్లచెరువు : దొండపాడు బైపాస్ రోడ్డుపై వరద ప్రవాహం

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి


విద్యుత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కోదాడరూరల్ : భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి సూచించారు. గురువారం కోదాడ విద్యుత్ శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఆ శాఖ అధికారులు, సిబ్బంది సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యుత్ నిలిచిపోయిన చోట వెంటనే మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలో గత రెండు రోజులుగా ఐదు వందల మంది సిబ్బంది విధుల్లో ఉన్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. విద్యుత్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాజీ, సీజీఎం భిక్షపతి, ఎస్‌ఈ ఫ్రాంక్లిన్, టెక్నికల్ డీఈ దాలినాయుడు, హుజూర్‌నగర్ డీఈ వెంకన్న కృష్ణయ్య, ఏడీఈ వెంకన్న, ఏఈ నరసింహనాయక్, సిబ్బంది ఉన్నారు.

నడిగూడెంలో వరద సమస్య పరిష్కారానికి కృషిచేస్తా

నడిగూడెం : నడిగూడెంలో వరద నీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని టీపీసీసీ డెలికేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రవహిస్తున్న వరద నీటిని ఆయన పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు దున్నా శ్రీనివాస్, దున్నా లింగయ్య, తదితరులున్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం

నడిగూడెం : మండల కేంద్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎస్సీ కాలనీలో పలువురి ఇళ్లల్లోకి నీరు చేరింది. గురువారం కోదాడకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పందిరి నాగిరెడ్డి పలువురి పేద కుటుంబాలకు ఐదు వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎస్ విద్యా సంస్థల సీఈఓ ఎస్ఎస్‌రావు, పనస నాగేశ్వరరావు, సరికొండ నాగరాజు తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు ఆహారం పంపిణీ

నడిగూడెం : గత రెండు రోజులుగా నడిగూడెం మండల కేంద్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఎస్సీ, బీసీ కాలనీలలోకి వర్షపు నీరు చేరింది. దీంతో బాధితులు పలువురి ఇళ్లల్లో ఆశ్రయం పొందుతున్నారు. దీంతో గురువారం నడిగూడెంకు చెందిన ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పందిటి నవీన్‌కుమార్ 35 మందికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు.

మొక్కల పంపిణీ

గరిడేపల్లి : మొక్కలు పెంచడం అందరి బాధ్యత అని ఎంపీడీఓ సరోజ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బండా నర్సిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వర్‌రావు, టీఏ శిరీష, మేకపోతుల సరిత, సతీష్, రావుల వెంకన్న, సుదీర్‌రెడ్డి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

కలకోవలో ఫీవర్ సర్వే

మునగాల : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయమనోహరి కోరారు. గురువారం మండలంలోని కలకోవలో రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వైరల్ ఫీవర్ ఇంటింటి సర్వేలో ఆమె పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఇద్దరు డెంగ్యూ జ్వరం బారిన పడ్డారని మరో 9 మందికి సాధారణ జ్వరాలు సోకాయన్నారు. వీరికి అవసరమైన మందులు సరఫరా చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, రేపాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ జయమ్మ, ఎంపీఓ నరేష్, డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి సముద్రాల సురేందర్, హెల్త్ అసిస్టెంట్ లింగం రామకృష్ణ, ఏఎన్ఎంలు నాగమణి, నరసమ్మ, పద్మ, శాంతమ్మ, శ్రీను, గ్రామపంచాయతీ కార్యదర్శి దొంగరి సైదులు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వారం రోజుల వ్యవధిలో ఇద్దరు కౌలు రైతుల ఆత్మహత్య

మునగాల : మండల కేంద్రానికి చెందిన ఇద్దరు కౌలురైతులు వారం రోజుల వ్యవధిలోనే గడ్డిమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన మిడిసినమెట్ల వెంకటేష్ (28) అనే యువకుడు అవివాహితుడు. గత కొంత కాలంగా గ్రామంలో భూములను కౌలుకు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యక్తిగత కారణాలతో ఈనెల 9న తాను సాగుచేస్తున్న పొలం వద్ద గడ్డిమందు తాగాడు. దీంతో కుటుంబసభ్యులు తొలుత కోదాడకు అటు నుంచి ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ వెంకటేష్ పదవ తేదీన మృతిచెందాడు. గ్రామానికి చెందిన సిరికొండ రాజేష్(40) తనపై దొంగతనం నేరం మోపి అక్రమంగా స్టేషన్‌లో కేసు నమోదు చేశారని మనస్థాపానికి గురై బుధవారం వద్ద పొలం వద్ద గడ్డిమందు సేవించి సెల్ఫీ వీడియో తీసి కుటుంబసభ్యులకు ఫోన్ చేశాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కోదాడరూరల్ : మండల పరిధిలోని కాపుగల్లు శివారులో గుర్తు తెలియని పురుషుని మృతదేహం లభ్యమైనట్లు గురువారం రూరల్ పోలీసులు తెలిపారు. కాపుగల్లు శివారులోని ఎన్ఎస్పీ కాల్వలో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని, తెల్లటి చొక్కా, నలుపు రంగు లోయర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


జలబిందెలు, బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్తున్న గిరిజనులు

మఠంపల్లి : మండలంలోని బాడవాతండాలో శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ నాలుగవ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన మహిళలు బోనాలు, జలబిందెలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బొడ్రాయికి జలాభిషేకం చేసి బోనాలు సమర్పించారు. శ్రీప్రసన్నాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. మాజీ జెడ్పీటీసీ బానోతు జగన్‌నాయక్ భారతి, మాజీ సర్పంచ్ దరావత్ గోవింద్‌వాల్జి, మాజీ ఉపసర్పంచ్ బాలునాయక్, ఆలయ పూజారి శ్రీనునాయక్, హనుమా, రాములు, నాగా, రమేష్, చిరంజీవి, సైదా, నాగేంద్ర, వాచ్యా, రామారావు, గోవిందా, భీకా, చిన్నా, రంగా, మహిళలు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లలోకి అనుమతించాలి


డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న లబ్ధిదారులు

కోదాడ : పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించి రెండు సంవత్సరాలు దాటుతున్న లబ్ధిదారులను ఇళ్లలోకి అనుమతించకపోవడం అన్యాయమని, ప్రభుత్వం వెంటనే ఇళ్లలోకి అనుమతించాలని సామాజిక కార్యకర్త చలిగంటి ప్రమీల కోరారు. గురువారం లబ్ధిదారులతో కలిసి డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద ముందస్తుగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చిత్తుకాగితాలు ఏరుకొని జీవించే ఎలాంటి ఇంటి వసతి లేని వారికి ఇక్కడ ఇళ్లు కేటాయించారని కానీ వారిని ఇళ్లలోకి అనుమతించకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆమె అన్నారు.

ఒత్తిడిని జయించేందుకు క్రీడలు దోహదం

కోదాడరూరల్ : ఒత్తిడిని జయించేందుకు క్రీడలు దోహదపడతాయని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎండి.ఉమర్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం కోదాడలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షటిల్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. వృత్తిలో భాగంగా ఒత్తిడికి గురవుతున్న న్యాయవాదులు ప్రతిరోజు ఆటలు ఆడటం ద్వారా మానసిక ప్రశాంతతో పాటు శారీక దృఢత్వం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు ఉన్నారు.


షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న జడ్జి సురేష్

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

మోతె : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్య శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని హుస్సేన్‌బాద్ గ్రామం నుంచి మోతె మండల కేంద్రం వరకు బీజేపీ మండల నాయకులు, కార్యకర్తలు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పెరుగు మధు, మైనంపాటి శ్రీనివాసరెడ్డి, బానోతు శ్రీను, ఉప్పల రామచంద్రయ్య, బొంత వెంకటేశ్వర్లు, నవిలె లింగయ్య, ధర్మారెడ్డి, కృష్ణమూర్తి, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో తిరంగా ర్యాలీ

నేరేడుచర్ల : పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలు చేతపట్టి పట్టణ ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జై భారత్, జైజై భారత్, వందేమాతరం నినాదాలతో పట్టణం హోరెత్తింది. బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు కొనతం నాగిరెడ్డి, చింతకుంట్ల రాజేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు రమావత్ నరినాయక్, బాల వెంకటేశ్వర్లు, సత్యనారాయణరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, నాగయ్య, రామ్మూర్తి, నాగేశ్వర్‌రావు, లక్ష్మణ్, సతీష్, దొంతిరెడ్డి వెంకట్‌రెడ్డి, భరత్, నాగిరెడ్డి, అనిల్‌గుప్తా, ఉపేంద్రాచారి, నర్సింహరావు, శ్రీనివాసచారి, రాము, లక్ష్మణ్, విమల, కృష్ణవేణి, అరుణ తదితరులున్నారు.


నేరేడుచర్లలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఊరూరా ముత్యాలమ్మ బోనాల పండుగ


చిలుకూరులో బోనాలు ఎత్తుకొని ఆలయానికి వెళ్తున్న మహిళలు


నేరేడుచర్ల : గంటవారిగూడెంలో..


మునగాల : సీతానగరంలో..